17 APR 2019

# అప్రమత్తంగా విధులు నిర్వర్తించండి

## ఎస్పీ రచనాసింగ్

పుదుచ్చేరి పార్లమెంటు స్థానానికి గురువారం ఎన్నికలు జరగనున్న సందర్భంగా కేంద్ర పారా మిలటరీ దళాలు, పోలీసులు విధులను అప్రమత్తతతో నిర్వర్తించాలని యానాం ఎస్పీ రచనాసింగ్ సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల విధులలో పాల్గొనేందుకు వచ్చిన దళాలు, సంబంధిత అధికారులతో ఆమె మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తరలింపు ప్రారంభమైనప్పటి నుంచి అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేస్తామని, ఓటు వేసేందుకు వచ్చే పౌరులు, అనుమతి ఉన్నవారిని తప్ప వేరెవర్నీ నిర్ణీత పరిధిలోకి రానివ్వబో మన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఇంతవరకు ప్రశాంతంగా కొనసాగిందని, ఇదే విధంగా పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ భద్రతాధికారి, పుదుచ్చేరి తూర్పు విభాగం ట్రాఫిక్ ఎస్పీ ఎ.సుబ్రహ్మణియన్, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ హనుమాన్‌సింగ్ మీనా, భక్తవత్సలం బృందం పాల్గొన్నారు.



సీఆర్‌పీఎఫ్, పోలీసు దళాలకు సూచనలిస్తున్న రచనాసింగ్

# యానాంకు తరలివస్తున్న యువ ఓటర్లు

పుదుచ్చేరి పార్లమెంటు ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో చదువుతున్న యువ ఓటర్లు యానాంకు వస్తున్నారు. ఓటు హక్కు వినియోగం ప్రతిఒక్కరి వ్యక్తిగత బాధ్యత అంటూ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తుండడంతో తమ ఓట్లు వేసేందుకు వందలమంది ప్రయాణమవుతున్నారు. పుదుచ్చేరిలోని వివిధ కళాశాలల్లో యానాంకు చెందిన 400 మంది పైగా యువతీ, యువకులు చదువుతున్నారు. ఇప్పటికే కొందరు విద్యార్థులు యానాం చేరుకోగా, మరికొందరు మంగళవారం, బుధవారం రావడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

# సమయస్ఫూర్తితో వ్యవహరించాలి: రుద్రగౌడ

యానాం నియోజకవర్గంలో పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనేందుకు పుదుచ్చేరి నుంచి వచ్చిన ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల సమన్వయకర్త పీటీ రుద్రగౌడ, సహాయ రిటర్నింగ్ అధికారి శివరాజ్‌మీనా మంగళవారం సాయంత్రం శిక్షణ కల్పించారు. స్థానిక సర్వశిక్షాభియాన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజున నిర్వహించాల్సిన విధులను వివరించారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించడంతో పాటు, నిర్ణీత పత్రాలన్నింటినీ సత్వరమే పూర్తి చేయాలన్నారు. పౌరపాట్లకు తావివ్వకుండా విధుల్ని సక్రమంగా నిర్వహించాలని, దేశవ్యాప్తంగా మొదటి విడత పోలింగ్ సందర్భంగా తలెత్తిన పౌరపాట్లను తెలుసుకుని తగు జాగ్రత్త వహించాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు జయచంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు.



ప్రిసైడింగ్ అధికారులతో మాట్లాడుతున్న రుద్రగౌడ

# 'పారిశ్రామిక పురోభివృద్ధి లక్ష్యం కావాలి'

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి వ్యాప్తంగా సంక్షోభంలో చిక్కుకున్న పారిశ్రామిక రంగం పురోభివృద్ధి ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రధాన ఎన్నికల హామీ, లక్ష్యం కావాలని యానాం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు అన్నారు. 2005 నుంచి పుదుచ్చేరి వ్యాప్తంగా వందల సంఖ్యలో పరిశ్రమలు మూత పడ్డాయని, దీనివల్లే ప్రభుత్వాదాయం కుంటుపడిందని, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. కేంద్రం నుంచి నిధులు, పథకాలు మంజూరు చేయించుకోవడానికి కీలకమైన ఎంపీలు పుదుచ్చేరితో పాటు కారైకాల్, మాహే, యానాం ప్రాంతాలకు ప్రతి మూడు నెలలకు ఒకసారన్నా వచ్చి పథకాల పురోగతిని సమీక్షించుకోవాలన్నారు. పుదుచ్చేరి పారిశ్రామిక ఆర్థిక పురోగతికి అసలు ఏం చెయ్యాలనుకుంటున్నారో ప్రజలు ప్రశ్నించాలని, పారిశ్రామిక రంగం ప్రగతిపై స్పష్టమైన ప్రణాళికతో స్థానికులను కలుపుకొని వెళ్లే అభ్యర్థినే ప్రజలు ఆదరించాలన్నారు. 2005లో యానాం నుంచి వచ్చే పన్నుల ఆదాయం రూ.70 కోట్లు ఉండేదని, 2015కు రూ. 2 కోట్లకు పడిపోయిందని చెప్పారు. కేంద్రానికి పన్నుల ద్వారా ఆదాయం ఇబ్బడిముబ్బడిగా వెళ్లేదని, దానితో నిధులు విడుదలా సక్రమంగా జరిగేదన్నారు. వెళ్లే మొత్తం బాగా తగ్గిపోవడంతో నిధుల కోసం బతిమిలాడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పార్టీలకతీతంగా ఎంపీలు పుదుచ్చేరి అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

17 APR 2019

# ముగిసిన ఎన్నికల ప్రచారం

యానాం, ఏప్రిల్ 16: నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం 5 గంటలతో ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో ఇప్పటి వరకు హోరెత్తించిన వివిధ పార్టీల ప్రచార రథాల మైకులు మూగబోయాయి. గురువారం పోలింగ్‌కు సంబంధించి ఎన్నికలశాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార గడువు ముగిసిన అనంతరం 48గంటల పాటు 144వ సెక్షన్ అమలులోని వచ్చిందని జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ టి.తరున్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 19వ తేదీ ఉదయం 6గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కోడ్ కఠినంగా అమలు చేస్తామన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎన్నికల కోఆర్డినేటర్ రుద్రగౌడ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శివరాజ్‌మీనా

# ఓటర్ల సంఖ్య 36,562 మంది

యానాం, ఏప్రిల్ 16: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 36,562కు చేరింది. వీరిలో పురుషులు 17,632 మంది, మహిళలు 18,921 మంది, 9మంది సర్వీస్ ఓటర్లు (పురుషులు 7, స్త్రీలు 2) ఉన్నారు. వీటిలో నూతన ఓటర్లు, మార్పులు, చేర్పుల అనంతరం తుది నివేదికను ఎన్ని కలశాఖ విడుదల చేసింది. గురువారం జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

# ఓటు వేసేందుకు ఈ కార్డులు తప్పనిసరి

యానాం, ఏప్రిల్16: ఓటరు లి సులో పేరు ఉండి, ఓటరు గుర్తింపు కార్డు లేకపోయినప్పటికీ ఎన్నికల సంఘం సూచించిన ఏదో ఒకటి గుర్తింపు కార్డుతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని పుదుచ్చేరి ఎన్నికల శాఖ ప్రధాన అధికారి ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం 11 గుర్తింపు కార్డుల వివరాలను జారీ చేసింది. వీటిలో పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు జారీ గుర్తింపుకార్డు, పోస్టు ఆఫీసు, బ్యాంక్ పాస్‌బుక్, పాన్‌కార్డు, స్మార్ట్‌కార్డు, ఎంఎన్ఆర్ఈజీఏ జాబ్ కార్డు, కేంద్రకార్మిక శాఖ జారీ చేసిన హెల్త్‌కార్డు, ఫొటోతో ఉన్న పింఛన్ పుస్తకం,అధికారికంగా జారీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గుర్తింపుకార్డులతోపాటు ఆధార్ కార్డులు ఉన్నాయి.

17 APR 2019

# మూగబోయిన మైకులు.. ప్రచారానికి తెర

యానాం: పుదుచ్చేరిలోని ఏకైక లోక్‌సభ స్థానానికి గురువారం ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గత నెలరోజులుగా రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో తెరపడింది. ఇన్ని రోజులు మైకుల హోరు, నాయకుల ప్రసంగాలతో పట్టణంలో నెలకొన్న హడావుడికి ముగింపు పలకడంతో మైకులు మూగబోయాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష ఎన్ఆర్‌కాంగ్రెస్ పార్టీలు ప్రత్యేక తెరలతో ఏర్పాటు చేసిన వాహనాలతో హైటెక్ ప్రచారాన్ని నిర్వహించడం విశేషం. ముఖ్యంగా తీరప్రాంత మత్స్యకార గ్రామాల ఓటర్లే లక్ష్యంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు

## రేపటి పోలింగ్‌పై రాజకీయపార్టీల దృష్టి

ఎమ్మెల్యే, మంత్రి హోదాలో మల్లాడి కృష్ణారావు నియోజకవర్గ పరిధిలో తాను కోట్లాది రూపాయలతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేసుకున్నారు.

అదేవిధంగా ప్రతిపక్ష ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రం అధికార కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేసింది. ముఖ్యంగా సంక్షేమ పథకాలు నిలిచిపోవడం, ఉచిత బియ్యం పంపిణీ నెలల తరబడి పంపిణీ కాకపోవడం, పింఛన్లు, ఉద్యోగనియామకాలు లేకపోవడం, పరిశ్రమలు మూసివేత తదితర అంశాలను ప్రజలలోనికి తీసుకువెళ్లింది. అదేవిధంగా యానాంలో అతిపెద్ద ఓటుబ్యాంకుగా ఉన్న కాపులను బీసీల జాబితాలో చేరుస్తామని ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం రంగసామి యానాం ప్రచారానికి వచ్చి బహిరంగంగా హామీ ఇప్పించడంలో సఫలీకృతమైంది. ముఖ్యంగా స్థానిక సమస్యలే ప్రచారాస్త్రాలుగా ఎన్ఆర్‌కాంగ్రెస్‌లోని బీజేపీ కూటమి నాయకులు సైతం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఆఖరులో బహుజనసమాజ్‌పార్టీ నాయకులు తమ పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారు. ఇక రేపు పోలింగ్ జరుగనున్న దృష్ట్యా ఎన్నికల్లో అత్యధిక ఓట్లు పొందేలా ఇరు పార్టీల నాయకులు వ్యూహరచనలో నిమగ్నమయ్యారు.